క్లుప్తంగా

కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామి

సి.బెళగల్: మండలంలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన కోనా వేంకటేశ్వర స్వామి వారికి పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏరువాక పౌర్ణమి కావడంతో భూదేవి, అలివేలి మంగమ్మ సమేత వేంకటేశ్వర స్వామి మూలమూర్తులకు అభిషేక పూజల అనంతరం ప్రత్యేకంగా పుష్ప, పత్రాలతో అలంకరించి నిత్య పూజలు చేశారు. పూజల్లో గ్రామస్తులతో పాటు, సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకూర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

సభ్యత్వాన్ని రెన్యూవల్ చేసుకోవాలి

పాణ్యం: పాణ్యం, మద్దూరు సొసైటీ పరిధిలోని రైతులు తమ సభ్యత్వం యథావిధిగా కొనసాగాంటే ఆయా సొసైటీల్లో రెన్యూవల్ చేయించుకోవాలని సొసైటీల సీఈఓలు మయలూరి ఉసేన్‌సాహెబ్, కోట్ల నరసింహులు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ప్రస్తుతం సొసైటీల పరిధిలో ఉన్న రైతులు ఆధార్, పాన్, పొలం పాస్‌బుక్ జిరాక్స్, మొబైల్ నంబర్, మూడు ఫొటోలు, నామిని ఆధార్ వివరాలతో ఆన్‌లైన్ చేయించుకోవాలన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం బలోపేతం చేసేందుకు, రైతులకు విస్తృత సేవలు అందించేందుకు పీఏసీఎస్ సభ్యత్వాన్ని నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

వేలం వాయిదా

పాణ్యం: స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలోని బండ్లమెట్ట వేలం వాయిదా వేసినట్లు ఈఓ ఆనందరావు తెలిపారు. శనివారం ఈఓఆర్డీ సులోచన, సర్పంచ్ మేలకల పల్లవి ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాట నిర్వహించారు. కాగా, మార్కెట్, బండ్లమెట్ట ధర రూ.5,50,000 అధికారులు నిర్ణయించగా అందుకు పాటదారులు ఆసక్తి చూపకపోవడంతో ఈనెల 26వ తేదీకి వాయిదా వేసినట్లు ఈఓ వెల్లడించారు. అలాగే కబేళాకు రూ.7,100 నిర్ణయించగా గ్రామానికి చెందిన రాజన్న రూ.8,100 వేలం పాట దక్కించుకున్నారన్నారు. కార్యక్రమంలో పాటదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయం కూల్చివేత దారుణం

కోడుమూరు రూరల్: తాడేపల్లిలో నిర్మాణంలో ఉన్న వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం కూల్చివేత దారుణమని పార్టీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ లాయర్ ప్రభాకర్ ఖండించారు. శనివారం కోడుమూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేవలం రాజకీయ కక్షతోనే చంద్రబాబు ప్రభుత్వం కార్యాలయాన్ని కూల్చివేసిందని, కూల్చివేతలు ఆపాలన్న కోర్టు ఉత్తర్వులను సీఆర్‌డీఏ అధికారులు ధిక్కరించడం దారుణమన్నారు. ఇకనైనా సీఎం చంద్రబాబు నాయుడు ఇలాంటి దురాగతాలకు స్వస్తి పలకాలని, లేకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

క్యాజువాలిటీ విస్తరణకు చర్యలు



క్యాజువాలిటీ విస్తరణ పనులను పరిశీలిస్తున్న డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, కేవీ సుబ్బారెడ్డి

కర్నూలు (హాస్పిటల్) : కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో క్యాజువాలిటీ విస్తరణకు చర్యలు చేపట్టినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. పూర్వ ఈసీజీ రూమ్, ఫార్మసీ రూమ్, నర్సింగ్ రూమ్ స్థానంలో క్యాజువాలిటీ విస్తరణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనికి అవసరమైన 20 పడకలను కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి వితరణ చేస్తున్నారని తెలిపారు. త్వరలో పూర్తిస్థాయిలో మరమ్మతు పనులు పూర్తి చేసి నూతన క్యాజువాలిటీని ప్రారంభిస్తామన్నారు.

పోస్టులన్నీ భర్తీ చేయాలి

కర్నూలు సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 25 వేల టీచర్ పోస్టులన్నీ భర్తీ చేసి, ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవి కుమార్ కోరారు. కర్నూలు రూరల్ మండల పరిధిలోని పాఠశాలల్లో ఆ యూనియన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులతో సమావేశమై మాట్లాడారు. నూతన ప్రభుత్వం 117 జీఓను రద్దు చేయాలని, ప్రతి పాఠశాలల్లో ఇద్దరు టీచర్లు ఖచ్చితంగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్‌సీ ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం కర్నూలు మండల అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, సోమన్న, జిల్లా కౌన్సిలర్ జయరాజు, రామచంద్రుడు, శేషఫణి, హనుమన్న, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

సిరుల పంట..మొక్కజొన్న

- గడివేముల మండలంలో ఏడు వేల ఎకరాల్లో సాగు
- ఏడాది పొడవునా అదే పంట
- ఎకరాకు రూ.30 వేలకు పైగా ఆదాయం

గడివేముల: ఖరీఫ్ సీజన్‌లో రైతులు మొక్కజొన్న సాగుపై ఆసక్తి చూపుతున్నారు. వాతావరణం కూడా ఇందుకు సహకరిస్తోంది. కొత్తగా ఆలోచిస్తూ ఏడాది పొడవునా సాగు చేపడుతూ ముందుకు సాగుతున్నారు. లేత దశలో తెగుళ్ల నివారణ చేపడుతూ ఆర్థికంగా నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తున్నారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో అత్యధికంగా వరితో పాటు వివిధ రకాల పంటలు వేస్తుండగా కొన్ని గ్రామాల్లో ఏడాది పొడవునా మొక్కజొన్న పండిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. ఇది పశువులకు కూడా దాణాగా, మేతగా పనికొస్తోంది. చాలా పరిశ్రమల్లో ముడి సరుకు గాను, తినుబండారాలు పేలాలు, తీపికండె, కాయగూరల రకంగాను వినియోగిస్తున్నారు. వాడకం బాగా పెరగడంతో సాగు కూడా పెరుగుతోంది.

మండలంలో ఏడు వేల ఎకరాల్లో సాగు..

మండలంలో మొత్తం 34,382 ఎకరాల పొలం ఉండగా ఖరీఫ్‌లో 25 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగుచేశారు. మొక్కజొన్న పంటను 6 నుంచి 7 వేల ఎకరాలలో పంటను సాగు చేశారు. తక్కువ పెట్టుబడితో తొందరగా చేతికి వచ్చే పంటగా రైతులు దీనిని ఎన్నుకున్నారు. ఎకరాకు రూ.15 నుంచి 20 వేల వరకు ఖర్చు అవుతుండగా, ఎకరాకు రూ.25 నుంచి రూ.30 వేల ఆదాయం వస్తుందని అన్నదాతలు చెబుతున్నారు.

లేత దశలో తెగుళ్ల నివారణ...

కిలో విత్తనానికి 3 గ్రాముల మాంకోజెట్ లేదా థైరం లేదా కాప్టాన్‌తో విత్తనశుద్ధి చేసుకుంటే లేత దశలో మొక్కలను తెగుళ్ల బారి నుండి కాపాడుకోవచ్చు.

ఎరువుల యాజమాన్యం..

వర్షాధారపు పంటకు విత్తే సమయంలో మూడో వంతు నత్రజని, మరోసారి 30-35 రోజుల సమయంలో మూడోవంతు నత్రజని, 50-55 రోజుల మధ్య మరోసారి మూడోవంతు నత్రజనిని వేయాలి. విత్తే సమయంలో మొత్తం భాస్వరం ఎరువును, సగం పొటాష్ ఎరువును వేయాలి. మిగతా సగం పొటాష్‌ను పూత దశలో వేసుకోవాలి. నీటిపారుదల పంటకు విత్తే సమయంలో నాలుగో వంతు నత్రజని, 25-30 రోజుల సమయంలో మరోసారి నాలుగో వంతు నత్రజని, 45-50 రోజుల మధ్య నాలుగో వంతు నత్రజని, చివరగా 60-65 రోజుల మధ్యకాలంలో నాలుగో వంతు వేయాలి. ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్‌ను మూడు పంటల కొకసారి దుక్కిలో వేయాలి. మొక్కలలో జింక్ లోపం ఉన్నట్లయితే లీటరు నీటిలో 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను కలిపి పంటపై పిచికారీ చేయాలి. భూమిలో తగినంత తేమ ఉన్నపుడు మాత్రమే పైపాటు ఎరువులు వేయాలి.

కలుపు నివారణ...

పంట విత్తిన తరువాత రెండు మూడు రోజుల లోపు అట్రజిన్ అనే కలుపు మందును పిచికారీ చేయాలి. దీనిని తేలిక నేలలో ఎకరాకు 800 గ్రాములు, బరువు నేలలో ఎకరాకు 1200 గ్రాములను 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన నేలపై తగినంత తేమ ఉన్నప్పుడు పిచికారీ చేయాలి. ఇలా చేయడం వల్ల వెడల్పాటి. గడ్డి జాతి కలుపు మొక్కలను దాదాపు ఒక నెలపాటు అదుపుచేయవచ్చు. మొక్కజొన్నలను పప్పుజాతి పంటల్లో అంతర పంటగా వేసేటపుడు ఎకరా పంటకు 200 లీటర్ల నీటిలో లీటరు పెండిమిథాలిన్‌ను కలిపి నాటిన రెండు రోజుల్లో పిచికారీ చేయాలి. విత్తిన నెల రోజులకు వెడల్పాటి కలుపు మొక్కలను గమనిస్తే ఎకరా పంటకు 200 లీటర్ల నీటిలో 500 గ్రాముల 2, 4డీ సోడియం సాల్ట్‌ను కలిపి పిచికారీ చేయాలి.



బూజునూరులో సాగు చేసిన మొక్కజొన్న పంట

విత్తు నాటే ముందు..

విత్తే ముందు భూమిని మూడు, నాలుగుసార్లు దుక్కు దున్నాలి. ఆఖరి దుక్కులో ఎకరాకు 10 సుమారు టన్నులు బాగా మాగిన పశువుల ఎరువు వేయాలి. తరువాత నాగలితో బోదె, కాలువలు చేసుకోవాలి. బోదెకు పైనుంచి మూడో వంతు ఎత్తులో విత్తాలి. దీని వల్ల నీటి పారుదల సులభంగా ఉంటుంది. వర్షపాతం ఎక్కువైనపుడు నీరు బయటకు పోయేందుకు వీలుకలుగుతుంది. మొలకెత్తిన పది రోజుల తరువాత ఒత్తుగా మొలిచిన చోట బలంగా ఉన్న ఒక్కో మొక్కను మాత్రమే ఉంచి అదనంగా ఉన్న మొక్కలను పీకివేయాలి.

ప్రతిసారి మొక్కజొన్ననే సాగుచేస్తాను



ఖరీఫ్‌లో మొక్కజొన్న సాగుకు ఎక్కువగా అనుకూలంగా ఉంటుందన్నారు. తక్కువ పెట్టుబడితో అధికలాభాలు వస్తుండటంతో 18 ఎకరాలలో మొక్కజొన్న పంటను వేస్తున్నా. ప్రతి ఏడాది మొక్కజొన్న పంటతో లాభాలు బాగానే వస్తున్నాయి. గ్రామాల్లోని వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

– చిన్న షాలుమియ్య, రైతు, బూజునూరు

త్వరగా వచ్చేపంట మొక్కజొన్న



పంట వేసిన రోజు నుంచి మూడు నెలలోనే తక్కువ పెట్టుబడితో త్వరగా పంట చేతికి వస్తుండటంతో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు. విత్తనం వేసిన 30-35 రోజులకు ఎద్దులతో లేదా ట్రాక్టర్ కలుపు మొక్కలను నివారించవచ్చు. వేసిన పంటలో కలుపు మొక్కల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.

– హేమసుందర్‌రెడ్డి, ఏఓ, గడివేముల

పరామర్శ



శేషిరెడ్డిని పరామర్శిస్తున్న డా.ఆదిమూలపు సతీష్, కోట్ల హర్షవర్ధన్ రెడ్డి

కర్నూలు సిటీ: గుండెకు బైపాస్ సర్జరీ చేయించుకున్న పంచలింగాల గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి తల్లి రామచంద్రమ్మను, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న అదే గ్రామానికి చెందిన సాయన్న తాత చిన్న నాగప్పను, అనారోగ్యంతో బాధపడుతున్న నందనపల్లె గ్రామానికి చెందిన వైఎస్‌ఆర్‌సీపీ నాయకుడు, సింగిల్ విండో మాజీ చైర్మెన్ శేషిరెడ్డిని వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్, కుడా మాజీ చైర్మన్ కోట్లహర్షవర్ధన్‌రెడ్డి శనివారం పరామర్శించారు. కుటుంబసభ్యులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రామచంద్రమ్మ, చిన్న నాగప్పను మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను సతీష్ కోరారు.

● మండల పరిధిలోని దిన్నెదేవరపాడు గ్రామానికి చెందిన పెరుగు శ్రీధర్ రెడ్డి మాతృమూర్తి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆదిమూలపు సతీష్, కోట్ల హర్షవర్ధన్ రెడ్డి శ్రీధర్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరి వెంట ఆ గ్రామ మాజీ సర్పంచ్ పెరుగు భాస్కర్ రెడ్డి, ఎంపీటీసీ రాంనాథ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

వాహనాల సీజ్

కర్నూలు (టౌన్) : మండల పరిధిలోని దిన్నెదేవరపాడు గ్రామంలో శనివారం ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు ఎర్రమట్టి తవ్వకాలు చేపట్టారు. సమాచారం అందుకున్న గనుల శాఖ అధికారులు తనిఖీ చేసి పట్టుకున్నారు. పనులను నిలిపివేసి, రెండు హిటాచీ వాహనాలను సీజ్ చేసినట్లు గనుల శాఖ ఉప సంచాలకులు రాజశేఖర్ వెల్లడించారు. తనిఖీల్లో ఆ శాఖ విజిలెన్స్ ఏడీ బైరాగి నాయుడు, టెక్నికల్ అసిస్టెంట్ దిలీప్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలి



కోడుమూరులో ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

కోడుమూరు రూరల్: పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం పట్టణంలోని పాతబస్టాండ్ సెంటర్ ప్రధాన రోడ్డుపై పార్టీ నాయకులతో కలిసి బైఠాయించారు.కృష్ణ మాట్లాడుతూ సరుకులు, కూరగాయల ధరలు రోజురోజుకు పెరిగిపోతుండడంతో సామాన్యులు కొనలేని పరిస్థితి నెలకొందన్నారు. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వాలు వెంటనే స్పందించి ధరలను తగ్గించాలని, లేకపోతే ప్రజలతో కలిసి మరింత ఉద్యమిస్తామని క్రిష్ణ హెచ్చరించారు. సీపీఐ మండల కార్యదర్శి రాజు, పట్టణ సహాయ కార్యదర్శి మధు, స్థానిక నాయకుఉల తిమ్మప్ప, నాగరాజు, శివుడు, పెద్దరాముడు, శాలన్న, శివశంకర్, దామోదర్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను సత్కరించిన ఏపీ ఎన్‌జీఓ నాయకులు



జిల్లా కలెక్టర్ సృజనను సత్కరిస్తున్న ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ నేతలు

కర్నూలు(అగ్రికల్చర్): ఎన్నికల విధులను నిర్లక్ష్యం చేశారనే కారణంతో 103 మంది అధికారులు, ఉద్యోగులపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేసిన నేపథ్యంలో ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా శాఖ నేతలు కలెక్టర్ డాక్టర్ జి.సృజనను కలిసి సత్కరించారు. శనివారం వారు కలెక్టర్‌ను చాంబరులో కలిశారు. కోరిన వెంటనే స్పందించి సస్పెన్షన్‌ను ఎత్తి వేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయమని ఉమ్మడి జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వీసీహెచ్ వెంగళరెడ్డి, జవహర్‌లాల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ జేఏసీ ప్రధాన కార్యదర్శి హృదయరాజు, ఎన్‌జీఓ అసోసియేషన్ నగర శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ కాశన్న, రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రామకృష్ణారెడ్డి, జిల్లా నాయకులు బలరామిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కేసీహెచ్ కృష్ణుడు, శ్రీనివాసులు, సాయిరామ్, 4వ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి, వ్యవసాయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రవిప్రకాశ్ రావు, వెటర్నరీ పార ఉద్యోగుల సంఘం నేత వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పత్తి సాగులో మెలకువలు పాటించాలి

● ఏడీఏ సాలురెడ్డి



రైతులకు పత్తిలో నూతన సాగు విధానాలను వివరిస్తున్న ఏడీఏ సాలురెడ్డి

సి.బెళగల్: నూతన విధానాల్లో భాగంగా పత్తిలో ఒత్తు పంట సాగు (అధిక సాంద్రత సాగు పద్ధతి)పై రైతాంగం దృష్టి చారించాలని కర్నూలు ఏడీఏ సాలు రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక స్థానిక ఆర్బీకేలో ఏఓ మల్లేష్‌కుమార్ ఆధ్వర్యంలో పత్తి పంటలో అధిక సాంద్రత సాగు పద్ధతిపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ, జిల్లా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు పత్తి సాగు విధానాలను వివరించారు. శాస్త్రవేత్తలు కల్యాణి, శివరామకృష్ణ, మోహన్‌విష్ణువర్ధన్ బీటి విత్తనాలు వచ్చిన తరువాత పత్తిపంట సాగులో ఏర్పడిన పరిస్థితులను వివరిస్తూ పత్తి ఉత్పాదకత గణనీయంగా తగ్గిందని, తక్కువ కాలపరితితో పంట సాగును చేసి అధిక లాభాలు పొందే విధానాలను వెల్లడించారు. అధిక సాంద్రత సాగులో రైతులు ఎకరాకు లక్షా ఇరవై వేల మొక్కలను విత్తుకోవాలని, ఒక్కసారి పంట దిగుబడులను తీసుకుని పంట మార్పిడితో రెండవ పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. డీఆర్‌సీ డీఎం శ్రీలత, ఏడీఏ గిరీష్ పత్తి పంట సస్యరక్షణ చర్యలు, ఎరువుల వినియోగం, పంటల రక్షణను విపులంగా వివరించారు. ఈ సందర్భంగా ఒత్తు సాగు నమూనా కోసం చింతమానుపల్లెకు చెందిన రంగన్న అనే రైతుకు పత్తి విత్తనం, మందులను అధికారులు అందజేశారు. ఏఈఓ సిద్దు, ఎంపీఈఓలు, వీఏఏలు, ఆయా గ్రామాల రైతులు ఉన్నారు.

బీరప్ప స్వామికి ప్రత్యేక పూజలు



గూడూరులో బీరప్పస్వామికి పల్లకోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

గూడూరు రూరల్: సమృద్ధిగా వర్షాలు కురిసి, సాగు చేసిన పంటలు బాగా పండాలని కోరుతూ పట్టణ మాదాసి కురువ సంఘం ఆధ్వర్యంలో శనివారం బీరప్పస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం సాయంత్రం స్థానిక బీరప్పస్వామి ఆలయంలోని ఉత్సవమూర్తిని సుంకేసులలోని శ్రీరంగనాథస్వామి దేవాలయానికి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేపట్టారు. మరుసటి రోజు శనివారం తెల్లవారుజామున తుంగభద్రానది నుంచి బిందెలో నీటిని తీసుకొని, స్వామి వారిని పల్లకీలో కొలువుంచి ఊరేగింపుగా దాదాపు 13 కి.మీ. కాలినడకన గూడూరుకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పట్టణంలో స్వామి వారికి గ్రామోత్సవం చేపట్టారు. శ్రీ ఆంజనేయస్వామి, చౌడేశ్వరిదేవి, అంబాభవాని, సుంకులమ్మ, వీరభద్రస్వామి దేవాలయాల మీదుగా బీరప్పస్వామి దేవాలయానికి చేరుకున్నారు. అనంతరం సంఘ పెద్దలు తుంగభద్రానది నీటితో శివ లింగానికి జలాభిషేకం చేశారు. ఏటా..ఏరువాక పున్నమి రోజున సుంకేసుల నుంచి గూడూరు వరకు బీరప్పస్వామి ఉత్సవ మూర్తిని ఊరేగించడం ఆనవాయితీ అని పెద్దలు తెలిపారు. టైలర్ దస్తగిరి, మధు, రమేష్, భాస్కర్, మద్దిలేటి, వెంకటేశ్వర్లు, శివ, లక్ష్మన్న, బాలముని, పూజారి వెంకటేశులు, పులికొండ, ఆనంద్, సుభాష్ పాల్గొన్నారు.

నేడు పాణి హట్టి చిడాదహి మహోత్సవం

కర్నూలు కల్చరల్: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో నగర వనంలో ఆదివారం ఉదయం 9 గంటలకు పాణి హట్టి చిడాదహి మహోత్సవం జరుగుతుందని ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు తెలిపారు. శ్రీకృష్ణబలరాములను మహా శంఖాభిషేకం, 108 రకాల పదార్థాలతో మహారాజ భోగ నివేదన, తిరుపతి ఇస్కాన్ ఉపాధ్యక్షుడు రూపేశ్వర చైతన్య ప్రభుచే ప్రత్యేక ప్రవచనం, మహా ప్రసాద వితరణ కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

వీఆర్వోలకు పదోన్నతి కల్పించాలి

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో గ్రేడ్-2 వీఆర్వోలుగా పనిచేస్తున్న వారికి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలని ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు వి.గిరికుమార్‌రెడ్డి కోరారు. శనివారం ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఆధ్వర్యంలో వీఆర్వోలు కలెక్టర్ డాక్టర్ జి.సృజనను ఆమె కార్యాలయంలో కలసి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో వీఆర్వోల సంఘంఅధ్యక్షుడు కరణం పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

వేలంతో ఆలయాలకు పెరిగిన ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

పాణ్యం : మండల కేంద్రమైన పాణ్యంలోని ఆలయాల భూములకు శనివారం వేలం పాట నిర్వహించినట్లు ఈఓ సువర్ణ తెలిపారు. ఆమె మాట్లాడుతూ దేవదాయశాఖ పరిధిలోని ఆలయకు సంబంధించి మొత్తం 49 ఎకరాలకు గాను 6.95 ఎకరాలు మినహాయించి మిగిలిన 42.05 ఎకరాల భూమి కౌలుకు వేలం నిర్వహించామన్నారు. వీటికి గతేడాది వేలం ద్వారా రూ.1,69,000 ఆదాయం రాగా ఈ ఏడాది రూ.3,14,500 ఆదాయం సమకూరిందన్నారు. వీటిలో వీరనారాయణస్వామికి చెందిన 10 ఎకరాల భూమికి గతేడాది రూ.53,500 రాగా ఈ ఏడాది రూ.82,000 పలికిందన్నారు. దీంతో రూ. 28,500 ఆదాయం సమకూరినట్లయ్యిందన్నారు. అలాగే పాణికేశ్వరస్వామి చెందిన 9.62ఎకరాలు గతేడాది రూ.61500 పోగా ఈ సారి రూ.90,000 పలకడంతో రూ.28,500 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అయితే సత్యనారాయణ స్వామికి చెందిన 6.85 ఎకరాల భూమికి ఎవరూ ముందుకురాలేదన్నారు. కార్యక్రమంలో తనిఖీ అధికారి శశికుమార్, సిబ్బంది తిరుమలయ్య, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరించాలి



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న కాలనీ వాసులు

ఓర్వకల్లు : మండలంలోని నన్నూరు గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం గ్రామ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం 6వ వార్డు వాసులతో కలసి ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. పార్టీ మండల నాయకులు మధుసూదన్ మాట్లాడుతూ.. గ్రామంలోని 6వ వార్డులో గత మూడు నెలలుగా తాగునీటి సమస్యతో కాలనీ ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. దీంతో ఒకటి రెండు కిలోమీటర్ల దూరం వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో రామాంజనేయులు, రామేశ్వరి, లక్ష్మీదేవి, సావిత్రమ్మ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



నగరపంచాయతీ కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ దివాకర్‌రెడ్డి

గూడూరు రూరల్: వర్షాకాలం కావడంతో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశం ఉన్నందున వారు జాగ్రత్తలు పాటించేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి సూచించారు. గూడూరు నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం చైర్మన్ జి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆయా శాఖల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డయేరియా, డెంగీ, మలేరియా తదితర వ్యాధులు ప్రబలే అవకాశముందని, ముందస్తు నివారణ చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రజలు కాచి వడబోసిన నీటిని తాగాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. శానిటరీ సిబ్బంది పట్టణంలో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ వేయాలని ఆదేశించారు. క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే కుళాయిలకు సరఫరా చేయాలని సూచించారు. పీహెచ్‌సీ డాక్టర్ ప్రత్యూష, ఎంఈఓ సునీలమ్మ, మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి

కల్లూరు: ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో గ్రామాల్లో డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. శనివారం మండల పరిషత్ సమావేశ భవనంలో పంచాయతీ క్యారదర్శులు, కల్లూరు, ఉలిందకొండ పీహెచ్‌సీ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తుండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కల్లూరు, ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు శైలేష్ కుమార్, రఘు, ఈఓఆర్డీ రవికిషోర్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

గూడూరు రూరల్: పట్టణంలోని సివిల్ సప్లయిస్ హమాలీ కార్మికుడు మల్లాపు రాజు అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీఐటీయూ డివిజన్ కార్యదర్శి మోహన్ శనివారం మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి హమాలీ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.20వేలు అందజేశారు. మోహన్ మాట్లాడుతూ అనారోగ్యంతో మరణించిన కార్మికుడు రాజు కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రూ. 5 లక్షల పరిహారం, భార్యకు పింఛన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కృప, చిన్నరాజు, కొమ్మురాజు, భూత రామాంజనేయులు, కోళ్ల రాజు, మధు, గజ్జలన్న పాల్గొన్నారు.